సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



కోవెల..కళకళ

దాతల సాయం కోవెలకు నూతన కళ తీసుకువచ్చింది. లక్ష్మీనరసింహుని ఆలయం కళకళలాడుతోంది. - 8లో



అధికార లాంఛనాలతో..

అధికార లాంఛనాలతో కణితి విశ్వనాథం అంత్యక్రియలు జరిగాయి. పలు పార్టీల నాయకులు హాజరయ్యారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	42°	26°
ఇచ్ఛాపురం	40°	24°
పలాస	41°	25°
టెక్కలి	41°	25°
పాతపట్నం	39°	24°
నరసన్నపేట	41°	25°
శ్రీకాకుళం	41°	25°



న్యూస్‌రీల్

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి ఆదివారం వైభవంగా జరిగింది. చైత్ర మాసం ఆదివారం బహుళ ఏకాదశి సందర్భంగా స్వామికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చక్కగా అలంకరించి పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులు హారతులిచ్చారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి మాస కల్యాణ సేవ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. చైత్ర బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి కల్యాణ ఉత్సవం ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనివెట్టి మండపంలో అర్చకులు సాందీప్ శర్మ నిర్వహించారు. కల్యాణ సేవకు రూ.500 చెల్లించిన భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి శేష వస్త్రాలను, ప్రసాదాలను, కల్యాణ తలంబ్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా రగ్బీ ఎంపికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా రగ్బీ జట్లు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. 12 మంది చొప్పున బాలికలు, బాలుర జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 30 నుంచి మే 1 వరకు కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో వీరంతా పాల్గొంటారని ఆర్గనైజర్ బాడాన నారాయణరావు తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన వారంతా ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించనున్న కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలురు జట్టు, పాతపట్నం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో బాలికల జట్లకు కోచింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఎంపికల్లో కె.కె.రామిరెడ్డి, సత్యనాగరాజు, శ్యామ్, జానకి, సీతయ్య, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్సవాలు సజావుగా జరగాలి'



డీఎస్పీని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉత్సవ కమిటీ చూసుకోవాలని డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని జరగనున్న గ్రామదేవత ఉత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి తిరువీధి, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఉత్సవాల్లో సేవలందించే వలంటీర్లకు డ్రెస్‌కోడ్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉత్సవ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

నిర్వాసితులకు సపోర్ట్



మూలపేట పోర్టు నిర్వాసితులకు కాలనీ నిర్మించనున్న ప్రదేశం

- మూలపేట పోర్టు నిర్వాసిత రైతులకు చకచకా పరిహారం చెల్లింపు
- నౌపడ సమీపంలో నిర్వాసిత కాలనీకి 58 ఎకరాలు ఇచ్చిన రైతులు
- సుమారు రూ.35 కోట్లతో అత్యాధునికంగా నిర్వాసిత కాలనీ

టెక్కలి: ఉత్తరాంధ్ర తీరానికి మణిహారంగా మారనున్న సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సంబంధించి పరిహారం పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఒక వైపు పోర్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లిస్తూ... మరో వైపు నిర్వాసితులకు కాలనీ కోసం భూములు ఇచ్చిన రైతులకు కూడా పరిహారం చెల్లింపులు వేగవంతం చేస్తున్నారు. ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూలపేట పోర్టు శంకుస్థాపనకు రానున్నారు. ఆయన పర్యటనకు మునుపే పరిహారం చెల్లింపులు చేస్తుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అత్యాధునికంగా నిర్వాసిత కాలనీ

మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా పూర్తిగా నిర్వాసితులైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన సుమారు 594 మందికి సరిపడే విధంగా నౌపడ సమీపంలో అత్యాధునికంగా కాలనీ నిర్మాణం చేపట్టనున్నారు. సుమారు రూ.35 కోట్లతో కాలనీ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు.

- ఈ కాలనీకి సంబంధించి 52 మంది రైతుల నుంచి 58 ఎకరాలను సేకరించారు.
- మొత్తం రూ.15.80 కోట్లు చెల్లించనున్నారు.
- ప్రస్తుతానికి 30.98 ఎకరాలకు సంబంధించి సుమారు 41 మంది రైతులకు రూ. 8.5 కోట్లకు గాను ఇప్పటికే రూ. 5.48 కోట్లు చెల్లించారు. మిగిలినవి క్రమంగా చెల్లిస్తున్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



నౌపడలో సీఎం సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ, ఎస్పీ రాధిక, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మూలపేట, నౌపడలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ ఆదివారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు, వీవీఐపీ వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, ప్రోటోకాల్ నిర్వహణ తదితర అంశాలపై ఎస్పీ జీఆర్ రాధికను అడిగి తెలుసుకున్నారు. విష్ణుచక్రంలో నిర్మితమవుతున్న పైలాన్, నిర్వాసితులతో సీఎం సమావేశ ప్రాంగణం, మూలపేటలో సిద్ధం చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, కాశీబుగ్గ డిఎస్పీ శివరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులకు వరం

గార: బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగడం మత్స్యకారులకు వరమని జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు అన్నారు. బందరువానిపేట గ్రామంలో స్థానిక నాయకులతో కలసి ఆదివారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకనే మత్స్యకారులకు భరోసా దొరికిందన్నారు. వేట నిషేధ సమయంలో భృతిని రూ.నాలుగు వేలు నుంచి రూ.పదివేలుకు పెంచడంతోపాటు సముద్ర ప్రమాదంలో చనిపోతే పరిహారాన్ని వెనువెంటనే ఇవ్వడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు హార్బర్ వల్ల వేట సులువు కావడంతో పాటు మత్స్యసంపద తరలించేందుకు మంచి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా మూలపేట వద్ద పోర్టు నిర్మాణం పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బర్రి వంశయ్య, దుమ్ము లక్ష్మయ్య, సిద్ధా రామారావు, పుక్కళ్ల కృష్ణ, మైలపల్లి పోలీసు, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు

'సీఎం సభకు తరలివెళ్దాం'

నరసన్నపేట: ఈ నెల 19న సంతబొమ్మాళి మండలం నౌపడ కూడలి వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభ ఉందని, కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఈ మేరకు పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. మండలాల నుంచి నాయకులు బాధ్యత తీసుకుని సభకు వచ్చే ప్రజలకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ రోజు నుంచే గ్రామాల్లో సీఎం సభ కోసం ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

తల్లి మందలించిందని..

- నదిలో దూకి బాలిక ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : కన్న తల్లి కాస్త కటువుగా మాట్లాడిందని ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. చదువుకోకుండా టీవీ ఎందుకు చూస్తున్నావు అని మందలించినందుకు ఏకంగా ప్రాణాలు తీసుకుంది. శ్రీకాకుళంలోని ముచ్చువానిపేటకు చెందిన ఆకుల ఢిల్లీశ్వరి(14) శనివారం రాత్రి నాగావళిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..

మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం చేస్తున్న ఆకుల గణేష్, సరస్వతి దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు శంకర్ వైజాగ్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె ఢిల్లీశ్వరి గుజరాతీపేటలోని ఏవీఎస్ఎం స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కుమార్తె టీవీ చూస్తుండటంతో తల్లి వచ్చి మందలించారు. పరీక్షలు మొదలయ్యాయని, చదువుకోవాలని గదిమారు. దీంతో కుమార్తె మనస్తాపానికి గురై 9.30 గంటల సమయంలో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించింది. వెంటనే తల్లి ఆమెను బుజ్జగించి నచ్చజెప్పి ఇంటికి తీసుకువచ్చారు. కానీ రాత్రయ్యాక బాలిక మళ్లీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాత్‌రూమ్ కోసం లేచిన తల్లికి కుమార్తె కనిపించకపోవడంతో కంగారుపడి అంతా వెతికారు. భర్తను నిద్ర లేపి, వైజాగ్‌లో ఉన్న కుమారుడికి కూడా ఫోన్ చేసి రాత్రంతా నగరమంతా గాలించారు. కానీ ఎక్కడా ఆమె ఆచూకీ దొరకలేదు.

ఆదివారం ఉదయం దత్తాత్రేయ గుడి సమీపంలో ఉన్న నాగావళి నదిలో ఒక బాలిక మృతదేహం ఉందని తెలిసింది. కీడు శంకిస్తూనే తల్లిదండ్రులిద్దరూ అక్కడకు వెళ్లి చూడగా.. ఢిల్లీశ్వరి విగతజీవిగా కనిపించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె నదిలో శవమై కనిపించడంతో వారు తల్లడిల్లిపోయారు. పోలీసులకు కూడా సమాచారం అందడంతో క్లూస్ టీమ్‌తో పాటు రెండో పట్టణ ఎస్ఐ వి.సందీప్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శేషు, రైటర్ సింహాచలం, కానిస్టేబుల్ నాయుడు, మహిళా కానిస్టేబుల్ మీన వెళ్లి బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆత్మహత్యే అయి ఉంటుందని భావించిన పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. పిల్లల భవిష్యత్ కోసమే తల్లిదండ్రులు మందలిస్తూ ఉంటారని, కాసింత కటువుగా మాట్లాడితే ఇలా కడుపుకోతకు గురి చేయడం భావ్యం కాదని సీఐ అన్నారు. ఈ వైఖరిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



నదిలోంచి బాలిక శవాన్ని బయటకు తీస్తున్న పోలీసులు



బాలిక శవాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

దొంగతనం నేరం మోపడంతో..

మెళియాపుట్టి: తోటి విద్యార్థులు హేళన చేయడంతో మనస్తాపానికి గురై 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పెద్దమడి గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సవర సుశాంత్(14) పెద్దమడి తోటల్లో ఆదివారం విగతజీవిగా కనిపించాడు. తోటి విద్యార్థి హరీష్ తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల పాఠశాలలో ఏదో దొంగతనం జరిగింది. దీనికి సంబంధించి సుశాంత్, ఆర్.హరీష్‌లను తోటి విద్యార్థులు, టీచర్లు హేళన చేశారు. దీంతో విద్యార్థులిద్దరూ చనిపోవాలని నిర్ణయించుకున్నారు. స్నానానికి ఉపయోగించే టవల్స్ తీసుకుని గ్రామానికి దూరంగా ఉన్న తోటల్లోకి వెళ్లారు. టవల్స్‌ను ఒకదానికి ఒకటి కట్టి తాడులా తయారుచేశారు. ముందు సుశాంత్ మెడకు టవల్ కట్టుకొని గిలగిలా కొట్టుకుని చనిపోయాడు. ఇది చూసిన హరీష్ ఆత్మహత్య చేసుకునే ధైర్యం చేయలేకపోయాడు. మృతుడు పలాస మండలం గోవిందపురం గ్రామానికి చెందినవాడు. చిన్నప్పుడే తల్లి చనిపోగా.. తండ్రి వేరే పెళ్లి చేసుకుని వెళ్లిపోవడంతో చిన్నాన్న వీరాస్వామి, పిన్ని రాధమ్మ పెంచుకుని చదివిస్తున్నారు. అయితే సుశాంత్ మెడపై సన్నటి తీగ చుట్టిన ఆనవాళ్లు ఉన్నాయని, మృతదేహం నేలపై ఉందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సుశాంత్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అంటున్నారు. క్లూస్‌టీమ్ మృతదేహాన్ని పరిశీలించారు. సంఘటనా స్థలానికి డీడీ నాగేష్, పాతపట్నం సీఐ వినోద్‌బాబు, ఎస్ఐ రాజేష్ చేరుకుని దర్యాప్తు చేశారు.



విద్యార్థి సుశాంత్ మృతదేహం



సంఘటనా స్థలంలో పోలీసులు

'ధర'హాసమెప్పుడో?



ఇంటిలో నిల్వ ఉంచిన జీడి పిక్కల బస్తాలు

- మద్దతు ధర కోసం జీడి రైతుల ఎదురుచూపు

పలాస: జీడి రైతులు మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని 30 మండలాల్లో జీడి పంట సాగవుతోంది. అయితే పలాస రెవెన్యూ డివిజన్‌లో మరీ ఎక్కువగా ఉంది. ఉద్దానం ప్రాంతంలోని ఏడు మండలాల్లోని ప్రజలకు ఈ పంటే ప్రధాన జీవనాధారం. జిల్లా వ్యాప్తంగా 24 వేల హెక్టార్లలో జీడిని రైతులు సాగు చేస్తుండగా ఉద్దానం ప్రాంతంలో తీర ప్రాంత పొడుగున సారవంతమైన నేల కావడంతో ఈ పంటకు ఈ ప్రాంతంలో మంచి డిమాండ్ ఉండేది. ఉద్దానం జీడితోనే పలాసకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. పలాస జీడిపప్పు దేశంలోని ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతోంది. అయితే ఈ ప్రాంతంలోని జీడి పరిశ్రమలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా 412 ఉన్నాయి. ఈ పరిశ్రమలు ఏడాది సగటున 200 రోజులు పనిచేస్తాయి. దీనివల్ల వేలాది మంది కార్మిక కుటుంబాలు కూడా బాగుపడుతున్నాయి. అయితే ఈ పరిశ్రమలకు జీవనాడిగా ఉన్నటువంటి ఇక్కడ జీడి రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా.. అందుకు తగ్గట్టుగా జీడి పంటకు ధరలు మాత్రం రావడంలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఏడాది పొడుగున ఈ పంట కోసం రైతులు ఎదురు చూస్తుంటారు. మార్చి నుంచి ఆశలు పెంచుకున్న రైతులు మే నెల చివరి వరకు తోటల్లో పిక్కలను రక్షించుకోవడానికి నానా తంటాలు పడుతుంటారు. తోటల నుంచి పిక్కలను సేకరించిన తర్వాత వాటిని గోనె సంచుల్లో నింపి భద్ర పరుస్తారు. ప్రస్తుతం ఆ విధంగా ఇంటికి తీసుకొచ్చిన పిక్కలను అవసరాలకు అమ్ముకుందామంటే వ్యాపారస్తులు ముందుకు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది 80 కిలోల బస్తా పిక్కలు రూ.11 వేలకు రైతులు విక్రయించగా నేడు రూ.9 వేలు ధర పలుకుతోంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సంఘాల నాయకులు మాత్రం బస్తా పిక్కల ధర కనీసం రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్దానంలో జీడితోటల విస్తీర్ణం ఇలా..


మండలం	పలాస	వజ్రపుకొత్తూరు	మందస	సోంపేట	కవిటి	కంచిలి	ఇచ్ఛాపురం
పంట విస్తీర్ణం ఎకరాల్లో	7,025	7,471	11,837	6,196	6,716	7,675	4,580

ఆశాజనకంగా పంట



ఈ ఏడాది జీడి పంట ఆశాజనకంగా ఉంది. దిగుబడులు బాగున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో 80 కిలోల పిక్కల బస్తా రూ.9 వేలు ఉంది. కొద్ది రోజులు ఆగితే ధరలు పెరిగే అవకాశం ఉంది. విదేశీ పిక్కల ధరలు రూ.8 వేలు ఉన్నాయి. మన ప్రాంతం పిక్కలు మాత్రం నాణ్యత రీత్యా ప్రస్తుతం రూ.9 వేలు ఉంది. ఇప్పుడేం తొందర లేదు. మే వరకు పంట చేతికి వస్తూనే ఉంటుంది.
– సీహెచ్ శంకర్‌దాసు,
ఉద్యాన వన శాఖాధికారి,పలాస మండలం

గిట్టుబాటు కావడం లేదు



ప్రస్తుతం జీడి పంట గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడులు చాలా ఎక్కువ అవుతున్నాయి. ఎకరా జీడి తోటకు కనీసం రూ.10 వేలు పెట్టుబడి అవుతోంది. తోటలు మలుపు నుంచి దుక్కి, ఎరువులు, క్రిమిసంహారణ చర్యలు తప్పడం లేదు. దీనికి తోడు శ్రమ కూడా చాలా ఎక్కువ. కుటుంబం మొత్తం కష్టపడి పిక్కలను సేకరించాల్సి ఉంది. కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు.
– కుత్తుం వినోద్,
జీడి రైతు, మాకన్నపల్లి, పలాస మండలం

దొంగనోట్ల నిందితుడు టీడీపీ నేతల అనుచరుడే

టెక్కలి: టెక్కలి దొంగనోట్ల నిందితుడి జాడ దొరికింది. టీడీపీ నేతల నీడలో అక్రమాలకు పాల్పడుతున్న పట్నాన అమృతసాగర్ అనే వ్యక్తి గుట్టు రట్టయ్యింది. ఇటీవల టెక్కలిలో హాట్ టాపిక్‌గా మారిన దొంగనోట్ల వ్యవహారంలో దొరికిపోయిన పట్నాన అమృతసాగర్ స్థానిక టీడీపీ నేతల అనుచరుడు కావడం విస్మయం కలిగిస్తోంది. టెక్కలికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్ట పురుషోత్తం, కోదండరామవీధికి చెందిన టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి రెయ్యి ప్రీతీష్‌చంద్ర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పేర మురళీధర్‌కు ఈ అమృత్ సాగర్ అనుచరుడిగా వ్యవహరిస్తున్నాడు.

కోదండరామవీధికి చెందిన పట్నాన అమృతసాగర్ తల్లిదండ్రులు స్థానికంగా లేకపోవడంతో అమ్మమ్మ వారింట్లో ఉంటున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడి అడ్డదారిలో సంపాదించడం మొదలుపెట్టాడు. ఇదే క్రమంలో టెక్కలి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో నకిలీ నోట్లు డిపాజిట్ చేస్తూ దొరికిపోయాడు. ఈ యువకుడే ఇటీవల టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలకు కోదండరామవీధి నుంచి కొంత మేరకు నగదు ఖర్చు చేసినట్లు సమాచారం. టీడీపీ నాయకుల అండతో కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్‌లు, దొంగ నోట్లు వ్యవహారాల్లో అమృతసాగర్ అక్రమంగా సంపాదించి జల్సాలు చేస్తున్నట్లు సమాచారం.

ఈ యువకుడిని పూర్తిస్థాయిలో విచారిస్తే.. ఈ వ్యవహారంలో టీడీపీ నాయకుల ప్రమేయం ఉందా.. లేక బయట వ్యక్తుల ప్రమేయం ఉందా అనే విషయం తెలుస్తుంది.



అచ్చెన్నాయుడు పుట్టిన రోజు ఫ్లెక్సీలో టీడీపీ నాయకులతో పాటు అమృతసాగర్ (వృత్తంలో వ్యక్తి)

ఐక్యతతో హక్కుల సాధన

జలుమూరు: ఐక్యతతో మన హక్కులు సాధించుకోవాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్(కై కాల చేనేత సామాజిక వర్గం) జాతీయ కార్యవర్గ సభ్యులు కై లసాని సాయికుమార్ అన్నారు. ఆదివారం టెక్కలిపాడులో చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 చేనేత కులాల ప్రజలంతా విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో ఉన్నత స్థాయిలో నిలబడేందుకు కలిసి నడవాలన్నారు. కార్యక్రమంలో నాయుడు మోహన్ కుమార్, వంగపులుసు దాలయ్య, సత్యనారాయణ, సురేష్, రేగు శంకర్, శ్రీనివాసరావు, నాయుడు గురునాథ్, నాయుడు కిశోర్ తోపాటు పలువురు స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కులసంఘ ప్రతినిధులు

క్లుప్తంగా

తప్పిన పెను ప్రమాదం



రోడ్డుపై విరిగి పడిన విద్యుత్ స్తంభం, మర్రి చెట్టు కొమ్మ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బాతుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఉదయం పెద్ద మర్రిచెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి తీగలతో పాటుగా రోడ్డుపై పడిపోయాయి ఈ సమయంలో ప్రయాణికులు, వాహనాలు రాకపోకలు లేకపోవడం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు గుర్తించి వెంటనే సంబంధిత శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. ప్రమాదకరమైన సంఘటన చోటు చేసుకున్నప్పటికి ఎలాంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్పందించిన అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తగు మరమ్మతుల చర్యలు చేపట్టారు.

షెడ్ల నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



విరాళాల చెక్కును ఈవోకు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ ఇంద్ర పుష్కరిణి మార్గంలో నిర్మించ తలపెట్టిన జింకు రేకు షెడ్ల నిర్మాణానికి నగరానికి చెందిన లైఫ్‌స్టైల్ ఫర్నిచర్ షోరూం అధినేత లాడె చంద్రశేఖర్, లాడె నాగరాజులు చెరో రూ.లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి ఆధ్వర్యంలో దాతలు ఈ విరాళాన్ని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా మండవల్లి రవి మాట్లాడుతూ దాతల సహకారంతోనే ఆలయంలో వరుసగా షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, అవకాశం ఉన్న భక్తులు తమ వంతుగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ మాట్లాడుతూ ఆలయానికి ఏ రూపంలోనైనా రూ.లక్ష వరకు విరాళమిచ్చిన దాతలకు ప్రత్యేక పర్వదినాల్లో విశిష్ట దర్శనాలకు వీలుగా దాతల పాసులను అందజేస్తామని ప్రకటించారు.

షూటింగ్ బాల్ సీనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన షూటింగ్ బాల్ సీనియర్ బాలురు, బాలికలు

పాతపట్నం: జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ సీనియర్ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశామని జిల్లా షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు శిమ్మ కృష్ణారావు, కార్యదర్శి తంగి మురళీ మోహన్‌లు తెలిపారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా జట్టును ఎంపిక చేశామన్నారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాలను 65మంది క్రీడాకారులు హాజరు కాగా 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశామని అధ్యక్షుడు తెలిపారు. ఈ నెల 22, 23వ తేదీల్లో అనంతపురంలో జరిగే పోటీలకు హాజరవుతారని తెలిపారు. అక్కడ జరిగే పోటీల్లోనూ విద్యార్థులు రాణించి సిక్కోలు గౌరవాన్ని పెంచాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు డు బి.రామమూర్తి, సెక్రటరీ మధు, పీడీ శేఖర్‌బాబు, టి.ఈశ్వరరావు, శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,030-00
బంగారం(22సి. 10గ్రా.)	55,950-00
వెండి (కిలో)	81,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

కోవెల..కళకళ



లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

- రెండు శతాబ్దాల నాటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం జీర్ణోద్ధరణ
- రూ.16లక్షలతో ఆలయ సుందరీకరణ
- దాతల సహకారంతో పనులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో రెండు వందల ఏళ్ల నాటి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని దాతల సాయంతో భక్తులు బాగు చేసుకుంటున్నారు. తుమ్మావీధిలో ఉన్న ఆలయం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. అయితే చాలాకాలంగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆలయం వెలుగులోకి రాలేదు. నగరం నడిబొడ్డులో ఉన్న ఈ ఆలయానికి కిల్లిపాలెం, పాత్రునివలస, అరసవల్లిలో కలసి వ్యవసాయ భూమి 5.04 ఎకరాలు ఉంది. దీని ద్వారా ఫలసాయం కింద ఏడాదికి రూ.52,900లు వస్తుంది. పట్టణంలోని వీరన్న షెడ్డు దగ్గర 32 సెంట్లు ఖాళీ స్థలం ఉంది. దీన్ని త్వరలో లీజుకు అప్పగించేందుకు దేవదాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆలయం ఆవరణ పుష్కరిణితో కలిపి 1.64 ఎకరాలు ఉంటుంది. 2010లో పక్కన ఉన్న ఆలయ స్థలం 59 సెంట్లను విక్రయించారు. ఆ ఆదాయాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ వడ్డీతోనే ఆలయ నిర్వహణ, అర్చకుల జీతభత్యాలు, సిబ్బంది జీతాలు నడుస్తున్నాయి.

దాతల సహకారంతో..

చాలాకాలంగా ఈ ఆలయం మరుగున పడిపోయింది. కాశిని వేంకటేశ్వరరావు అనే భక్తుడు మొదటగా ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అక్కడి నుంచి పనులు వేగం పుంజుకున్నాయి. ఆలయం చుట్టూ ఉన్న స్థలాన్ని కాపాడే పనిలో భాగంగా ఒక భక్తుడు ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా, మరో భక్తుడు ఆలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి చదును చేశారు. తర్వాత పుష్కరిణి వరకు మార్గం చదును జరిగింది. దాని ఒడ్డున ఆలయానికి ఎదురుగా సుందరంగా ఉండే విధంగా పార్కులా నిర్మించి అందులో విష్ణు భక్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ మండపం చుట్టూ ఖాళీగా ఉండడంతో కుక్కలు, పశువులు వస్తుండడంతో దాని చుట్టూ పిట్టగోడ కట్టించి గ్రిల్స్ వేయించారు. భోగమండపానికి టైల్స్ వేయించారు. ఆలయ ప్రాంగణంలో కూర్చునేందుకు వీలుగా సిమ్మెంటు బెంచీలు వేయించారు. ఆలయానికి నీటి వసతి కోసం బోరింగ్ కూడా వేయించారు. వీటన్నింటి కోసం భక్తులే రూ.16 లక్షల వరకు విరాళాలు ఇచ్చారు.

కాశిని రమణమ్మ రూ.ఒక లక్ష, రెడ్డి రవికుమార్ రూ.ఒక లక్ష, బోర అప్పలనరసమ్మ రూ.ఒక లక్ష, నడగ జగదీశ్వరరావు రూ.2.65లక్షలు, అంపలాం శేషగిరి రూ.2లక్షలు, చలపాక నరసయ్య రూ.50వేలు, పుణ్యపు కూర్మా రావు రూ.50వేలు, దొండపాటి నవీన్ రూ.48వేలు, సాసుమాన రామినాయుడు రూ.70వేలు ఇచ్చారు. కట్టబాబు అనే దాత ఆలయ గర్భగుడిలో ఉన్న టైల్స్ తొలగించి గ్రానైట్ పనులు చేయిస్తున్నారు.



లక్ష్మీనరసింహ స్వామి పాలరాతి విగ్రహం

అభివృద్ధికి సహకరిస్తాం..

ఆలయ అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తాం. దాతలు కూడా ముందుకు రావాలి. జిల్లా కేంద్రంలోని పురాతన ఏకైక లక్ష్మీనరసింహ మూర్తి దేవాలయం ఇది.

– సర్వేశ్వరరావు, ఈఓ

అధికార లాంఛనాలతో కణితి అంత్యక్రియలు



గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



కణితి విశ్వనాథం మృతదేహానికి పూలమాల వేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: మాజీ ఎంపీ, ప్రజా వైద్యుడు డాక్టర్ కణితి విశ్వనాథం అంత్యక్రియలు పలాస శ్మశాన వాటికలో అధికార లాంఛనాలతో ఆదివారం జరిగాయి. మధ్యాహ్నం 2 గంటలకు గౌతమ్ నివాస్ నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన మృతదేహాన్ని ర్యాలీగా డేకురుకొండ వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు ఎచ్చెర్ల సాయుధ పోలీసులు అధికార లాంఛనాలతో వందనం చేస్తూ గాలిలో కాల్పులు జరిపారు. కార్యక్రమాలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దగ్గరుండి పర్యవేక్షించారు. కుమారుడు రాజేంద్ర ఆయన చితికి నిప్పంటించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు భవానీ, డాక్టర్ శాంతారావు, పేరాడ తిలక్, దుర్గా ప్రసాద్ పాత్రో, బోర కృష్ణారావు, పలాస ఆర్టీఓ సీతారామ్మూర్తి, టీడీపీ నాయకులు, కూన రవికుమార్, గౌతు శిరీష, వజ్జ బాబూరావు, బీజేపీ నాయకులు పీవీఎన్ మాధవ్, దుప్పల రవీంద్ర, పైడి వేణుగోపాల్, చౌదరి బాబ్జీ, కిల్లి రామ్మోహన్‌రావు తదితరులు కణితిని కడసారి చూసేందుకు తరలివచ్చారు.

5 దేశాల్లో 'పల్లెగూటికి పండగొచ్చింది'విడుదల



మాట్లాడుతున్న పల్లెగూటికి పండగొచ్చింది సినిమా నిర్మాత, దర్శకుడు తిరుమలరావు, నటీనటులు

టెక్కలి: జిల్లాలోనే పూర్తి స్థాయిలో షూటింగ్ నిర్వహించిన 'పల్లెగూటికి పండగొచ్చింది' సినిమాను మే 26న 5 దేశాల్లో విడుదల చేస్తున్నట్లు సినిమా నిర్మాత, దర్శకుడు కంచరాన తిరుమలరావు వెల్లడించారు. సినిమా నటీనటులతో కలిసి ఆదివారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు సందేశాత్మకంగా లక్ష్మీ ఫిల్మ్ ప్రొడక్షన్‌పై ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, దుబాయ్ వంటి దేశాల్లో మొత్తం 400 థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేస్తున్నామని తిరుమలరావు వెల్లడించారు. సమావేశంలో నటీనటులు కె.రామ్‌ప్రసాద్, వి.మల్లయ్య, అమ్మ రామకృష్ణ, సాక్షి, మురళీధర్, రవితేజ, షణ్ముఖ, కృష్ణ, బి.ఉదయ్, అఖిల్, మధు, సింహాచలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాట్‌లో సత్తాచాటిన శ్రీనివాస్



ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి పాత ఆమదాలవలసకు చెందిన బొడ్డేపల్లి శ్రీనివాస్ 2022-23 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించన కాట్(సీఏటీ) పరీక్షలో 99.74 మార్కులు సాధించి సత్తాచాటాడు. ఈ మార్కులకు గాను ఇండియాలోనే అత్యుత్తమమైన ఇనిస్టిట్యూట్ ఐఐఎంఏ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్)లో సీటు పొందినట్లు తెలిపారు. శ్రీనివాస్ ఆరో తరగతి నుంచి 8 వరకు పాలకొండలోగల డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో, 9 నుంచి 10వ తరగతి వరకు విజయవాడలోగల గౌతమ పాఠశాలలో, ఇంటర్ మీడియట్ విజయవాడలోగల శ్రీచైతన్య కళాశాలలో, బీటెక్ ఐఐటీ బీహెచ్‌యూ, వారణాసిలో చదివినట్లు తెలిపారు. ఆయన తండ్రి బొడ్డేపల్లి రాజగోపాల్ కొత్తూరు వ్యవసాయసహాయ సంచాలకులుగా పనిచేస్తున్నారు. తల్లి పద్మజ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పాలకొండలోగల పెద్దకాపు వీధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు.

నేటి పోలీసు స్పందన రద్దు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం జిల్లా పోలీసు అధికారులు సోమవారం నుంచి భద్రతా ఏర్పాట్లు, బందోబస్తులో పాల్గొంటున్నందున స్పందన రద్దు చేసినట్లు వివరించారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



సాధారణ క్యూలైన్లలో భక్తులు

అరసవల్లి: చైత్ర మాస ఏకాదశి పర్వదినం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి ఆదివారం వేకువజామునకే చేరుకుని ఆదిత్యుని దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో ప్రత్యేక రోజు కావడంతో విశేష అలంకరణతో ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అనుమతిచ్చారు. భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేసేలా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాట్లు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ ప్రత్యేకంగా దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేయించారు. ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, నెమలపురి కోటేశ్వర చౌదరి తదితరులు భక్తులకు ప్రసాదాలను, స్వామి లామినేటెడ్ చిత్రపటాలను పంపిణీ చేశారు.

'సీఎం దయ వల్ల జీతాలు అందుతున్నాయి'



మంత్రి ధర్మానను కలిసిన టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్స్ సంఘ నేతలు

శ్రీకాకుళం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దయ వల్ల జీతాలు సక్రమంగా అందుతున్నాయని రాష్ట్ర టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్స్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు జ్యోతుల సూరిబాబు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిశారు. అమరావతి జేఏసీ పేరుతో చేస్తున్న ఉద్యమానికి రాష్ట్రంలోని పనిచేస్తున్న టైపిస్ట్, కంప్యూటర్స్ ఆపరేటర్స్ అంతా దూరంగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏడెనిమిది నెలలు జీతభత్యాలు లేక పస్తులు ఉండేవాళ్లమని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి సక్రమంగా జీతాలు అందిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ, మహిళా ఉద్యోగులకు అదనంగా 5 రోజులు సాధారణ సెలవులు మంజూరు చేసిందని తెలిపారు. మంత్రి ధర్మానను కలిసిన వారిలో రాంబాబు, భాస్కర్, సిద్దు, రామకృష్ణ, అశోక్, తదితరులు ఉన్నారు.

'టీడీపీ సెల్ఫీ రాజకీయాలు చేస్తోంది'

- మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుంటే టీడీపీ మాత్రం సెల్ఫీ రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర మత్స్యకార, పాడి, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. మండలంలోని కిడిసింగిలో సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాసలో రూ. 50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద సెల్ఫీ దిగగలవా చంద్రబాబూ.. అంటూ సవాల్ విసిరారు. రూ. 700 కోట్లతో ఉద్దాన ప్రాంతంలో ఇంటింటికి శుద్ధ జలం అందించే ప్రాజెక్ట్ వద్ద సెల్ఫీ తీసుకోవడానికి రాగలవా అంటూ మరో సవాల్ విసిరారు. వజ్రపుకొత్తూరు- కాశీబుగ్గ డబుల్ రోడ్డు, టెక్కలిపట్నం-నువ్వలరేవు డబుల్ రోడ్డుపై సెల్ఫీ దిగేందుకు సిద్ధమా అంటూ గౌతు కుటుంబానికి చురకలు అంటించారు. జగనన్న సారథ్యంలో సాగుతున్న ప్రజారంజక పాలనను ఓర్వలేక అసూయతో టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ విషాన్ని చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మూలపేట పోర్టు జిల్లాకు తలమానికం కానుందని అన్నారు. గర్భస్థ శిశువు నుంచి పండు ముసలి వరకు అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనువాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, నర్తు శేషయ్య, అప్పారావు, ఇరోతు హేమంత్, దువ్వాడ ఉమామహేశ్వరావు, మేఘనాథ్, కొల్లి భాస్కరరావు, కె.గిరిబాబు, విఘ్నేష్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, టీడీవి.గిరిరాజ్ తదితరులు ఉన్నారు.

'జీతాలపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు'



బల్లిపుట్టుగలో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయకు కృతజ్ఞతలు తెలుతుపున్న మంచినీటి పథకాల సిబ్బంది సంఘ ఉపాధ్యక్షుడు రమణమూర్తి, సభ్యులు

కవిటి: జిల్లావ్యాప్తంగా సీపీడబ్ల్యూఎస్ తదితర మంచినీటి పథకాల్లో పనిచేస్తున్న సుమారు 350 మంది ఉద్యోగుల జీతాల చెల్లింపులకు సంబంధించిన ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారని సీపీడబ్ల్యూఎస్ పంప్ ఆపరేటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బెందాళం రమణమూర్తి, తదితర సిబ్బంది అన్నారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌ను ఆదివారం బల్లిపుట్టుగలోని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు 28 నెలల జీతాల బకాయిలు ఉన్నాయని, ఆ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వివిధ కేటగిరీల వారీగా ఒక్కొక్కరికి పన్నెండు నెలల నుంచి పద్నాలుగు నెలలకు గాను జీతాల చెల్లింపులు జరిగాయని ఉద్యోగుల సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన నిధులు కూడా విడుదల చేయించి ఆదుకోవాలని కోరారు. తమకు వన్ ఏజెన్సీ విధానంలోగానీ, ఔట్‌సోర్సింగ్ విధానం పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ వారికి వివరించారు.

కులదూషణపై అట్రాసిటీ కేసు నమోదు

పొందూరు: మండలంలోని తుంగపేట గ్రామానికి చెందిన అనసూయ సంతకవిటి మండలం జగన్నాథపేట గ్రామానికి చెందిన జామి నీలయ్యను కులంపేరుతో దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొందూరు పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు. 10 రోజుల కిందట నీలయ్య కుమార్తె తుంగపేటలో సరుకులు కొనేందుకు అనసూయ దుకాణానికి వచ్చింది. ఈ సమయంలో అనసూయ పెంపుడు కుక్క నీలయ్య కుమార్తెను కరిచింది. ఈ విషయం అడిగేందుకు వెళ్లిన తనను అనసూయ కులం పేరుతో దూషించినట్లు జగన్నాథపేట పెద్దలకు నీలయ్య తెలిపారు. పెద్దలు రాజీ ప్రయత్నాలు విఫలం కావడంతో సంతకవిటి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొందూరుకు బదిలీ చేశారు.

ఎండల్లో.. జాగ్రత్తండోయ్

- వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి
- మధ్యాహ్నం ఇంటి పట్టున ఉండడం మేలు
- గ్రామాల్లో పీహెచ్‌సీ సిబ్బంది విస్తృత ప్రచారం



ఉర్లాం పంచాయతీ మతలబుపేటలో ఉపాధి వేతనదారులకు వడదెబ్బపై అవగాహన కలిగిస్తున్న ఉర్లాం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్(ఫైల్)

నరసన్నపేట: ఎండ తీవ్రత పెరిగింది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు డిగ్రీలు అధికంగా వేడి నమోదవుతోంది. అక్కడక్కడా వడగాడ్పులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది గ్రామాల వారీగా ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాలు, ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతాల వద్దకు వెళ్లి చైతన్యం కలిగిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాల్సిందే..

- తల నొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ లేదా పూర్తి అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలు.
- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తెలుపు రంగు పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ లేదా తలపాగా, గొడుగు ధరించాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తప్పకుండా తీసుకోవాలి. వీలైంత వరకూ బయటకు వెళ్లినప్పుడు వెంట మంచినీరు తీసుకువెళ్లాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు కచ్చితంగా ఒక గ్లాసు మంచినీరు తాగాలి. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులకు ఎండవేడిమి తగలకుండా చూసుకోవాలి.

వడదెబ్బకు గురైనప్పుడు..

- వడదెబ్బకు గురైన వారిని నీడగా ఉన్న చల్లని ప్రాంతానికి, గాలి బాగా తగిలే ప్రదేశానికి వెంటనే చేర్చాలి.
- వడదెబ్బకు గురైన వారిని తడి గుడ్డతో శరీరమంతా తుడుస్తూ ఉండాలి.
- వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.
- దుస్తులు వదులుగా ఉండాలి.
- ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు ఎండ తీవ్రతతో చేయకూడదు.
- ఎండలో తిరిగి బయట నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు తీసుకోరాదు.

ప్రచారం చేస్తున్నాం



వేసవిలో ఎండ తీవ్రత పెరిగింది. వడగాలులు వీస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు వడ దెబ్బకు గురి కాకుండా ఉండేందుకు తగువిధంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పీహెచ్‌సీలు, హెల్త్ క్లినిక్స్ అందుబాటులో ఉంచాం.

– సుజాత, ఉర్లాం పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు